బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 06 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 5

## మూసీనది నిర్వాసితుల జీవనోపాధి కోసం ప్రత్యేక కమిటీ




బలగం టీవీ, హైదరాబాద్

మూసీ నిర్వాసితులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మూసీ నిర్వాసితుల జీవనోపాధికి 14మందితో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సెర్ఫ్ సీఈవో ఛైర్మన్, జీహెచ్ఎంసీ కమిషనర్ వైస్ ఛైర్మన్ గా 14 మంది సభ్యులతో జీవనోపాధి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కమిటీలోని సభ్యులు.. తమ తమ శాఖలకు సంబంధించిన కార్యాచరణను రూపొందించి 30 రోజుల్లోగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది.

నిర్వాసితులకు జీవనోపాధి కల్పించడం కోసం కమిటీ నేతృత్వంలో అధ్యయనం నిర్వహించనుంది. మూసీ నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం రేవంత్ ఇటీవల హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కమిటీ వేసింది.

# ఫోర్త్ సిటీ కాదు.

ఉన్న సిటీని పట్టించుకోకుండా
ఫ్యూచర్ సిటీ కడుతాడంట.
ఫోర్త్ సిటీ పేరుతో
రియల్ ఎస్టేట్ దందా చేసే ప్రయత్నం

# ఫోర్ బ్రదర్స్ సిటీ

## ఫార్మా సిటీ భూములనే ఫోర్త్ సిటీ కోసం వాడే ప్రయత్నం చేస్తున్నారు

- చిట్టి నాయుడు
  కట్టేటోడు కాదు..కూలగొట్టేటోడు.
- రైతుబంధు లేదు, రైతు భరోసా
  లేకుండా పోయింది.
- మూసీ ప్రక్షాళన కేవలం పైసలు దొబ్బేందుకే.
- ఫార్మా సిటీ కోసం తీసుకున్న భూములను తిరిగి ఇచ్చేస్తామంటూ ముఖ్యమంత్రి చెప్పారు.
- ఎవరికైనా భూములు తిరిగి ఇచ్చారా?
- మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి,
  మంత్రుల మెదళ్లలోనే ఉంది.
- నా మీద అడ్డగోలు మాట్లాడిన మంత్రిని వదిలి పెట్ట. క్రిమినల్ కేసుతో పాటు పరువు నష్టం దావా కూడా వేస్తా.
- ముఖ్యమంత్రి మీద కూడా పరువు నష్టం దావా
- ముందు రెడ్డి కుంటలో నీ ఇల్లును,
  నీ అన్న ఇల్లును కూల్చు.
- రంగారెడ్డి జిల్లా కందుకూరులో రైతుల ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవీ, హైదరాబాద్

ఫోర్త్ సిటీ పేరుతో ఫోర్ బ్రదర్స్‌కు రియల్ ఎస్టేట్ భూములను పేదల భూములను గుంజుకోవాలని చూస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. గతంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోదండ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామన్నారు.కానీ నేడు ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లోనే ఫోర్త్ సిటీ ని నిర్మిస్తున్నారన్నారు. ఫార్మసిటీ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రంలో మహేశ్వరం ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఫోర్త్ సిటీ కోసం ఒక్క ఎకరం భూమిని కూడా సేకరించలేదన్నారు. రైతులను రుణమాఫీకి లేని డబ్బులు 1,50,000 కోట్ల రూపాయలను ఎలా సేకరిస్తారని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా,వడ్లకు ఐదు వందలు బొనాస్,రెండు లక్షల రుణమాఫీ నేటికీ జరగలేదన్నారు.

రూ. 2 లక్షల వరకు రుణాలు తెచ్చుకోండి.. డిసెంబర్ 9న మొదటి సంతకం చేసి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పిండు. కానీ ఇప్పటి వరకు రుణమాఫీ పూర్తి కాలేదు. రేవంత్ పరిపాలన పది నెలలు నిండేందుకు వచ్చింది.. కానీ రుణమాఫీ పూర్తిగా మాఫీ కాలేదు.

మిగితా 2వ పేజీలో




### మూసీ పరీవాహక ప్రాంత
## పేదలెవరూ నిరాశ్రయులు కారు

- వారందరికీ ప్రత్యామ్నాయం కల్పించే బాధ్యత ప్రభుత్వానిది
- ప్రతిపక్షాలు సలహాలివ్వాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గడ్డం వెంకటస్వామి (కాకా)95 వ జయంతిని

బలగం టీవీ, హైదరాబాద్

మూసీ పరీవాహక ప్రాంత నిరుపేదలెవరూ నిరాశ్రయులు కాబోరని, వారందరికీ ప్రత్యామ్నాయం కల్పించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రివర్ బెడ్, బఫర్ జోన్ లో ఉన్న వారందరికీ మంచి ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. ఈ విషయంలో కొందరు రెచ్చగొటే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని అన్నారు.

దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా) 95 వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. వెంకటస్వామిని స్ఫూర్తిగా తీసుకుని నిరుపేదలందరికీ ఒక మంచి జీవితాన్ని, మంచి వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. జాతీయ స్థాయి నేతల్లో కాకా వెంకట స్వామి ముఖ్యులు అని అన్నారు. తెలంగాణలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా కాకా జయంతిని అధికారికంగా నిర్వహించడం ప్రభుత్వాల బాధ్యత అని చెప్పారు 80 వేల మందికి పైగా నిరుపేదలకు ఇల్లు ఇప్పించిన నేత కాకా అని, సింగరేణి సంస్థ కార్మికులకు అండగా నిలిచారని చెప్పారు.

మూసీ పక్కన మగ్గుతున్న నిరుపేదల కోసం ఈ ప్రభుత్వం బ్రహ్మాండమైన ప్రణాళికలు తీసుకొస్తోందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీనిచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో వున్న పేదలను ప్రభుత్వం అనాథలు చేయదని, ప్రత్యామ్నాయం చూపుతామన్నారు. ఇందుకు ప్రతిపక్ష నాయకులు కేటీఆర్, హరీశ్ రావు, ఈటల, కమ్యూనిస్ట్ నాయకులు సచివాలయానికి వచ్చి సూచనలు చేయాలని కోరారు. మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్‌లో ఉన్నవారిని ఆదుకునేందుకు రూ. 10 వేల కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

హైదరాబాద్ నగరాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నగరంలో 12 నుంచి 14 వందల ఫీట్ల లోతుల్లోకి బోరు వేస్తే తప్ప నీళ్ల పడే పరిస్థితి లేదని చెప్పారు. మూసీ కాలుష్యం కారణంగా నల్గొండ ప్రజలు విషాన్ని దిగమింగుకుని బతుకుతున్నారు. నిరుపేదలను ఆదుకోవడానికి ప్రతిపక్ష నేతల సూచనలు కూడా తీసుకోవడానకి ఒక సమావేశం ఏర్పాటు చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి ముఖ్యమంత్రి గారు సూచించారు.

ఆనాడు వెంకటస్వామి గారు వేలాది మంది పేదలకు గూడు కల్పించారు. సింగరేణి మూతపడే దశకు చేరుకున్న దశలో దాన్ని కాపాడటానికి ఎంతో కృషి చేశారన్నారు. మహనీయుడు వెంకటస్వామి ఆకాంక్షించినట్టు తమ్మడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టి ఆదిలాబాద్ కు నీరందిస్తాం. అభివృద్ధిలో ఆదిలాబాద్ తో పాటు పెద్దపల్లి జిల్లాకు ప్రాధాన్యతనిస్తామని చెప్పారు.

ప్రజా ప్రభుత్వం కాకాను సమున్నతంగా గౌరవిస్తూ వారి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తాందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీలు మల్లు రవి గారు, గడ్డం వంశీకృష్ణ గారు, అనిల్ కుమార్ యాదవ్ గారు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం గారు, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి గారు, గడ్డం వినోద్ గారు, కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు గారు, కేఆర్ నాగరాజు గారు, మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్ గారు, సీపీఐ నాయకుడు చాడ వెంకట్ రెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు.




## హర్యానాలో ముగిసిన పోలింగ్

- సాయంత్రం 5 గంటల వరకు
  61 శాతం పోలింగ్ నమోదు
- 8న కౌంటింగ్

బలగం టీవీ, హైదరాబాద్

హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శనివారం ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఆద్యంతం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 61 శాతం పోలింగ్ నమోదైందని భారత ఎన్నికల సంఘం తెలిపింది. హర్యానాలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు ఇవాళ ఒకే విడతలో పోలింగ్ నిర్వహించారు. అంతకుముందే జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కూడా ముగిసింది. రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఒకేసారి అక్టోబర్ 8న విడుదల చేయనున్నారు.




## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

బలగం టీవీ, నిజామాబాద్

ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ కుటుంబాన్ని బలి తీసుకుంది. అన్ లైన్ బెట్టింగ్ ద్వారా కుమారుడు చేసిన అప్పులు తీర్చలేక దంపతులు సహా వారి కుమారుడు బలవన్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో వెలుగు చూసింది.

వివరాల్లోకి వెళ్తే.. బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండలం వడ్డేపల్లికి చెందిన హరీశ్ (22) రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డ హరీశ్.. దాదాపు రూ. 30 లక్షలు పోగొట్టుకున్నాడు. దీంతో కుటుంబాన్ని పోషించేందుకు అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పులు కూడా అధికం అవడంతో.. ఉన్న పొలాన్ని కూడా అమ్మేశాడు. అయినప్పటికీ ఆర్థిక ఇబ్బందులు హరీశ్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన హరీశ్.. తన తల్లిదండ్రులు సురేశ్ (53), హేమలత (45)లు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# హర్యానా కాంగ్రెస్‌దేనా..?







- జమ్ము కశ్మీర్‌లో సంకీర్ణం..
- ఎగ్జిట్ పోల్స్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్


హర్యానాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉందని ఎగ్జిట్ పోల్ సర్వేలు ప్రకటించాయి. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం.. కాంగ్రెస్-55, బీజేపీ- 26, ఐఎన్ఎల్డీ 2-3, జేజేపీ 0-1, ఇండిపెండెంట్లు 3-5 స్థానాలు గెలిచే అవకాశం ఉంది. హర్యానాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అధికారం చేపట్టాలంటే 46 సీట్లు కైవసం చేసుకోవాలి. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో ఉన్నట్లు పీపుల్స్ పల్స్ ప్రకటించింది. తన ప్రత్యర్థి బీజేపీపై 7 నుంచి 8 శాతం ఓట్ల ఆధిక్యత ప్రదర్శించే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇక ఈ నెల 8న ఫలితాలను ఎన్నికల సంఘం ప్రకటించనున్నది. ఈ నేపథ్యంలో హర్యానాలో ఈ సారి బీజేపీకి పరాభవం తప్పదని.. కాంగ్రెస్‌దే హవా అని పలు సర్వేలు పేర్కొన్నాయి. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం.. హర్యానాలో కాంగ్రెస్ పార్టీకి 45 శాతం, బీజేపీకి 38 శాతం, ఐఎన్ఎల్డీ-బీఎస్పీ కూటమికి 5.2 శాతం, ఆప్ పార్టీకి 1 శాతం, జేజేపీకి 1 శాతం లోపు, ఇతరులకు 10 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది.

ఇక జమ్మూ కశ్మీర్‌లో సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని పీపుల్స్ పల్స్ సౌత్ సర్వే చెప్పింది. హర్యానాలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ఆర్టికల్ 376 ఎత్తిన తర్వాతన తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీకి మెజారిటీ వచ్చే అవకాశం లేదని.. నేషనల్ కాన్ఫరెన్స్ మాత్రం అతిపెద్ద పార్టీగా నిలచే అవకాశాలున్నట్లు పేర్కొంది. హర్యానాలో 90, జమ్మూ కశ్మీర్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

పీపుల్స్ పల్స్ సర్వేలో జమ్మూ కశ్మీర్‌లో జేకేఎన్-సీ 33-35, బీజేపీ 23-27, కాంగ్రెస్ 13-15, జేకే పీడీపీ 7-11, ఏఐపీ 0-1, ఇతరులు 4-5 నుంచి సీట్లు గెలిచే అవకాశాలున్నాయని చెప్పింది. రిపబ్లిక్ మాట్రిజ్ సర్వే ప్రకారం.. బీజేపీకి 25, కాంగ్రెస్‌కు 12, ఎన్సీకి 15, పీడీపీకి 28, ఇతరులు ఏడు స్థానాల్లో గెలుస్తారని చెప్పింది. ఇండియా టుడే-సీ ఓటర్ సర్వేలో ఎన్సీ కూటమికి 11-15, బీజేపీ 27-31, పీడీపీ 0-2, ఇతరులు 0-1 సీట్లు వస్తాయని పేర్కొన్నది.

## 600 మంది ఊచకోత..

- ఆఫ్రికా దేశంలో మారణహోమం..



బలగం టీవీ, హైదరాబాద్

ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసోలో దారుణ ఘటన వెలుగు చూసింది. బర్సాలోగో పట్టణంలో అల్‌ఖైదా , ఇస్లామిక్ స్టేట్ అనుబంధ ఉగ్రసంస్థ జమాత్ నుస్రత్ అల్ ఇస్లామ్ వాల్ ముస్లిమిన్ మిలిటెంట్లు కిరాతకానికి పాల్పడ్డారు. గంటల వ్యవధిలోనే దాదాపు 600 మందిని కాల్చిపారేశారు. ఆగస్టు 24న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బైక్‌లపై వచ్చిన ఉగ్రవాదులు కనిపించిన వారిని పిట్టల్లా కాల్చి చంపేశారు. మృతుల్లో అత్యధికంగా మహిళలు, చిన్నారులే ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ప్రాణ భయంతో ప్రజలు పరుగులు పెట్టినా వదిలిపెట్టలేదని.. వారిని వెంబడించి మరీ కాల్పులు జరిపినట్లు తెలిపింది. ఘటన తర్వాత మృతదేహాలను సేకరించేందుకు స్థానిక అధికారులకు మూడు రోజుల సమయం పట్టినట్లు సదరు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. తొలుత ఈ ఘటనలో 200 మంది మరణించినట్లు ఐరాస అంచనా వేసింది. కానీ, 600 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని సమాచారం. ఆర్మీ, టెర్రరిస్టులకు మధ్య 2015 నుంచి ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ ఘర్షణల్లో ఇప్పటి వరకూ 20 వేల మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## డ్రగ్స్ సొమ్ముతో ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ



- ప్రధాని మోడీ తీవ్ర విమర్శలు

బలగం టీవీ, హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీని అర్బన్ నక్సల్స్ ముఠా నడుపుతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రమాదకరమైన ఎజెండాను ఓడించేందుకు ప్రజలు ఏకం కావాలని ఆయన కోరారు. మహారాష్ట్ర వాషిమ్ జిల్లాలో వివిధ ప్రాజెక్టులు ప్రారంభించిన మోడీ, అనంతరం నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతూ కాంగ్రెస్‌పై విమర్శల వర్షం కురిపించారు. "మనమంతా ఏకమైతే, దేశాన్ని విభజించాలనే వారి ఎజెండా విఫలమవుతుందని కాంగ్రెస్ భయపడుతోంది. భారతదేశం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేని వ్యక్తులతో కాంగ్రెస్ ఎంత సన్నిహితంగా ఉంటోందో ప్రజలు అందరూ చూడగలరు" అని మోడీ పేర్కొన్నారు. 'ఇటీవల దిల్లీలో వేల కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) పట్టుబడ్డాయి. ఇవి ఓ కాంగ్రెస్ నేతవి అని అనుమానిస్తున్నారు. యువతను డ్రగ్స్ వైపు మళ్లించి, ఆ డబ్బుతో ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది' అని ప్రధాని ఆరోపించారు. 'బ్రిటీష్ పాలన మాదిరిగానే కాంగ్రెస్ కుటుంబం కూడా దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల వారిని ఇతరులతో సమానంగా చూడదని ఆరోపించారు. వ్యవసాయం, పశుసంవర్ధక రంగాలకు సంబంధించి రూ.23,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని వాషిమ్‌లో ప్రారంభించారు. అంతకు ముందు బంజారా ప్రజల గొప్ప వారసత్వాన్ని తెలిపే, బంజారా విరాసత్ మ్యూజియంను ఆరంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కిసాన్ సమ్మాన్ నిధి 18వ విడతలో భాగంగా రూ.20వేల కోట్లను దాదాపు 9.4 కోట్ల మంది రైతులకు పంపిణీ చేశారు. నమో షెత్కారీ మహాసమ్మాన్ నిధి యోజన 5 విడతలో భాగంగా రూ.2000 కోట్లను పంపిణీ చేశారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఏఐఎఫ్) కింద రూ.1,920 కోట్ల విలువైన 7500కు పైగా ప్రాజెక్ట్‌లను ప్రధాని మోదీ ప్రారంభించారు. వీటిలో కస్టమ్ హైరింగ్ సెంటర్లు, ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు, గిడ్డంగులు, సార్టింగ్ అండ్ గ్రేడింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌లు, పోస్ట్-హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే దాదాపు రూ.1300 కోట్ల టర్నోవర్ సామర్థ్యం కలిగిన 9200 ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)లను కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు. ముఖ్యమంత్రి సౌర్ కృషి వాహిని యోజన 2.0 కింద మహారాష్ట్ర వ్యాప్తంగా 19 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5 సోలార్ పార్క్‌లను ప్రధాని ఆరంభించారు.

## రుణమాఫీ ఎందుకు జరగడం లేదు : ప్రధాని మోడీ

బలగం టీవీ, హైదరాబాద్

మహారాష్ట్రలోని వాసింలో శనివారంఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న నరేంద్ర మోడీ.. తెలంగాణలో అమలు చేసిన రుణమాఫీ పథకంపై కీలక వ్యాఖ్యలు చేశారు.రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇన్ని రోజులు గడుస్తున్నా రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రుణమాఫీ ఎందుకు జరగడం లేదని అక్కడి రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని మహారాష్ట్ర ప్రజలు మర్చిపోవద్దని మోదీ సూచించారు. కర్ణాటకలోనూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అంతకు ముందున్న బీజేపీ సర్కార్ రైతులకు అందజేసిన ఆర్థిక సాయాన్ని ఆపేసిందంటూ ధ్వజమెత్తారు. రాబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో.. కాంగ్రెస్, మహా వికాస్ అఘాడీని ఏమాత్రం విశ్వసించొద్దని నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు.

# ఫోర్త్ సిటీ కాదు. ఫోర్ బ్రదర్స్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

సెక్రటేరియట్‌లో ప్రభుత్వ పరిపాలన యంత్రాంగం ఉంటుంది. కానీ సీఎం మాత్రం లంకె బిందెలు ఉంటాయని సెక్రటేరియట్ వెళ్లిండట. ఇలాంటోడు మన ముఖ్యమంత్రి. చివరకు కనిపించిన దేవుడి మీద ఒట్టు పెట్టి.. పంద్రాగస్టు వరకు రుణమాఫీ చేస్తా అన్నాడు. ఏ దేవుడిని విడిచి పెట్టలేదు. మనషులనే కాదు చివరకు దేవుళ్లను కూడా మోసం చేసిండు చిట్టి నాయుడు అని కేటీఆర్ మండిపడ్డారు.

కందుకూరులో మనం చేసే లొల్లి దేశానికి తెలియొద్దని రేవంత్ కుట్ర చేస్తున్నాడు. సీఎం కుర్చీని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తుండు. దొడ్డు వడ్లకు బోనస్ ఇస్తా అన్నాడు. ఇవాళ సన్న వడ్లకు ఇస్తా అంటుండు. రుణమాఫీ, బోనస్, రైతు బంధు పేరుతో మోసం చేసిండు. అటుకాకుండా ఇటుకాకుండా రైతుల పరిస్థితి తయారైంది. రాష్ట్రంలోని ప్రతి వర్గాన్ని రేవంత్ మోసం చేసిండు. ఇంట్లో ఇద్దరికి పెన్షన్ ఇస్తా అన్నాడు. కోడళ్లకు కూడా ఇస్తా అన్నాడు. బతుకమ్మ చీరలు లేనే లేవు. దసరా పండుగ పండుగలా లేదు. ఒకటి కాదు రెండు కాదు.. ఆరు గ్యారెంటీలు నూరు రోజులు.. ఆరునైరైనా అమలు చేస్తా అన్నాడు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తా అన్నాడు.. ఇప్పుడేమో ఉన్న ఇండ్లను కూలగొడుతున్నాడు అని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చ వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. సబితా ఇంద్రారెడ్డి ముగ్గురు కుమారుల పేరు మీద ఫామ్ హౌస్ లో ఉంటే కుల్లగొట్టాలన్నారు.

మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లోనే ఉందని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిలా పని చేయడం లేదు.. రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. రైతుబంధు, ఆసరా పెన్షన్లు, రుణమాఫీకి పైసల్లేవట. కానీ లక్షా 50 వేల కోట్లు మూసీలో పోస్తాడట. ఎందుకో తెలుసా..? రైతుబంధు, పెన్షన్లు, తులం బంగారం ఇస్తే మీరు కమిషన్ ఇవ్వరు. కానీ అదే మూసీలో 30 వేల కోట్లు దొబ్బి ఢిల్లీకి మూటలు పంపాలి. అందుకు మూసీ పథకం పెట్టిండు. కేసీఆర్ కాళేశ్వరం కట్టిండు, పాలమూరు 90 శాతం కట్టిండు. నీళ్లు ఇచ్చేందుకు కట్టిండు. మరి మూసీతో ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తావు? సమాధనం ఉందా..? అంటే లేదు. కమిషన్లు దొబ్బేందుకు ప్లాన్ చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. ఆయనకు కమిషన్ల పిచ్చి పట్టింది. పేదవాళ్లకు సంక్షేమ పథకాలు అమలు చేస్తే పైసలు రావు.. కాబట్టి మూసీ పేరు మీద బ్యూటిఫికేషన్ కాకుండా లూటిఫికేషన్ చేస్తే కాంగ్రెసోళ్లకు డబ్బులు పంపి.. కుర్చీని కాపాడుకునేందుకు రేవంత్ రెడ్డి యత్నిస్తున్నాడని కేటీఆర్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో 14 వేల ఎకరాలు ఫార్మా సిటీకి సేకరించాం. ఇదే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోదండ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, రేవంత్ రెడ్డి ఊరురు తిరిగి చెప్పింద్రు.. బస్సు యాత్రలు పెట్టి చెప్పింద్రు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు చేసి తిరిగి రైతులకు భూములు ఇస్తామన్నారు. కానీ మాట మార్చారు. ఫార్మా సిటీ పేరు మార్చి ఫోర్త్ సిటీ అని పెట్టిండు. ఇంకోటి ఫ్యూచర్ సిటీ అట. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలో రాష్ట్ర ప్రభుత్వమే పనులు చేస్తదట. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గంలో కమిషన్లు, కాంట్రాక్టుల కోసం అలైన్‌మెంట్ మార్చి తమ భూములను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా పని చేస్తున్నాడు.. ముఖ్యమంత్రిలా పని చేయడం లేదు.. మాట్లాడితే మూసీ, హైడ్రా అంటు న్నాడు. చేయాల్సింది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లనే ఉంది. వాళ్ల నెత్తుల నిండా గబ్బు ఉన్నదని కేటీఆర్ విమర్శించారు.

మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రెడ్డి మాట్లాడుతూ ఫాక్స్ ఖాన్ కంపెనీ తెచ్చింది కెసిఆర్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఆరోజు గుజరాత్ రాష్ట్రానికి పోకుండా కంపెనీ తెచ్చి పెడితే ప్రస్తుతం ముఖ్యమంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం కంపెనీ తెచ్చినట్లుగా డ్రామాలు మొదలు పెడుతున్నాడని అన్నారు.ముఖ్యమంత్రికి మైకు దొరికితే చాలు కెసిఆర్ ,కేటీఆర్, హరీష్ రావులపై వ్యక్తిగత దూషణల కోసమే తప్ప అభివృద్ధిపై దృష్టి సాధించలేడని మండిపడ్డారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే ఉంటే ప్రజల మధ్యన ఉండి పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సురభి వాణి, నవీన్ రెడ్డి, షమీపూర్ రాజు, మహమ్మద్ అలీ, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, భువనగిరి పార్లమెంట్ బీ ఆర్ఎస్ ఇంచార్జ్ మల్లేష్, యువ నాయకుడు కార్తీక్ రెడ్డి, చిలుక మరి నరసింహ, చంద్రశేఖర్, విజేందర్ రెడ్డి,బీ ఆర్ఎస్ నాయకులు, అరవింద్ రెడ్డి,లక్ష్మీ నరసింహారెడ్డి, సురేందర్ రెడ్డి, చంద్రయ్య ముదిరాజ్, జయేందర్ ముదిరాజ్, రాజు నాయక్, కాకి దశరథ ముదిరాజ్, రేవంత్ రెడ్డి,కార్తీక్, చారి, మోహన్, వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, బీ ఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ కేంద్రంగా యారన్ డిపో



**బలగం టీవీ, హైదరాబాద్**

చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ కానుక ఇచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సుమారు 30వేల మరమగ్గాల కార్మికులకు నేరుగా లబ్ధి చేకూరుస్తూ.. వేములవాడ కేంద్రంగా యారన్ డిపో (నూలు డిపో)ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ శనివారం జీవో విడుదల చేశారు. దీంతో ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న నేతన్నల కోరిక నెరవేరింది.

పూర్తి వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు యారన్ డిపోను మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.ఈ యారన్ డిపోను వేములవాడలో ఏర్పాటు చేయనున్నారు. దీంతో దాదాపు 30 సంవత్సరా లుగా ఎదురుచూస్తున్న మరమగ్గాల కార్మికుల కల నెరవేరింది. యారన్ డిపోను ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఉన్న దాదాపు 40 వేల మరమగ్గాలపై పనిచేస్తున్న 30 వేల మంది నేతన్నలకు లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా వేములవాడ కేంద్రంగా యారన్ డిపోను ఏర్పాటు చేయడం వలన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలలోని వేల సంఖ్యలో మరమ గ్గాల కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగను న్నాయి. యారన్ డిపో ఏర్పాటు చేయడం వలన మరమగ్గాల పరిశ్రమలోని నేతన్నలకు పెట్టుబడిదారులపై ఆధారపడకుండా నేరుగా వారి ఉపాధి లభిస్తుంది. కాగా, యారన్ డిపోను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 కోట్ల నిధులను మంజూరు చేసింది.

ఈ యారన్ డిపో టెస్కో ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. మరమగ్గాల కార్మికులకు అవసరమగు నూలును టెస్కో క్రెడిట్ పద్ధతిలో సరఫరా చేసి వస్త్రాన్ని కొనుగోలు చేయనుంది. యారన్ డిపోను ఏర్పాటు చేయడంతో సిరిసిల్ల నేతన్నలతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిపై కూడా పరువు నష్టం దావా వేస్తా.

**బలగం టీవీ, హైదరాబాద్**

దిక్కుమాలిన మాటలు, రోతపుట్టించే మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన మంత్రివర్గాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా త్వరలోనే పరువు నష్టం దావా వేస్తానని తెలిపారు. సీఎం గబ్బు మాటలకు నీ మంత్రుల చెడ్డ మాటలకు సమాధానం చెబుతాం.ఇక నుంచి వదిలిపెట్టం. నాపై ఆరోపణలు చేసిన మంత్రిపై ఆల్రెడీ పరువు నష్టం దావా వేశాను. ముఖ్యమంత్రి మీద కూడా తొందర్లనే వేస్తా.. అడ్డగోలుగా మాట్లాడిన మంత్రిగారిని విడ పెట్టను.. క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టను. అటు క్రిమినల్, ఇటు సివిల్ డిఫమేషన్ రెండు సూట్లు వేస్తాను.. వదిలిపెట్టే ప్రసక్తే లేదు. తప్పే చేయనుప్పుడు భయపడం. ఏం చేసుకుంటవో చేస్కో అని మోదీకే చెప్పినం. ఈ చిట్టి నాయుడు ఎంత మనకు.. అడ్డిమారి గుడ్డి దెబ్బలో సీఎం అయిండు. ఇక ఆగుతలేడు. పెద్దోని అయిపోయానని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడు అని కేటీఆర్ మండిపడ్డారు.

సబితక్క ముగ్గురు కొడుకులకు ఫామ్ హౌస్‌లు ఉన్నాయట. మరి అవి ఎక్కడున్నాయో చెబితే మేమే కూలగొడుతాం. సబితక్క బిడ్డకు కూడా ఉందట. అది కూడా చూపిస్తే కూలగొడు తాం. మాట్లాడితే కూలగొడుతా అంటున్నావ్.. అది నీ ఇష్టం. రేవంత్ రెడ్డి నీ కళ్లు చల్లబడు తాయి అనుకుంటే.. మావి కూలగొట్టి అక్కడికి ఆపేయ్. పేదవాళ్లవి మాత్రం కూలగొట్టకు.. వారి ఇండ్లను ముట్టుకోవడం బంద్ చేయ్. ఇవాళ రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే బాధ అనిపిస్తుంది. ఒక దిక్కేమో రైతు గోస.. హైదరాబాద్ పోతే మూసీ బాధితుల రోదన. మూసీ పరివాహక ప్రాంతంలో 50 ఏండ్ల నుంచి ఇల్లు కట్టుకుంటే ఆక్రమణదారులు, కబ్జాదారులు అంటున్నాడు రేవంత్ రెడ్డి. మీ కాంగ్రెస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్లు చేసే.. ఇన్ని రోజులు పైసలు దొబ్బితింటివి. ఇప్పుడేమో కబ్జాకోరులు అని మాట్లాడుతున్నావు. నీకు చిత్తశుద్ధి ఉంటే.. కొడంగల్‌లోని రెడ్డి కుంటలో నీ సొంత ఇల్లు ఉంది.. దమ్ముంటే దాన్ని కూలగొట్టి.. పేదోళ్ల వద్దకు రా అని సవాల్ చేస్తున్నా. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మీ అన్న తిరుపతి రెడ్డి ఇల్లు కూలగొట్టు. అప్పటికీ కడుపు మంట చల్లారకంటే మావి కూలగొట్టు.. కానీ పేదల ఇండ్ల వద్దకు రావొద్దని కేటీఆర్ చెప్పారు.




# పోరాడి ఓడిన బంగ్లాదేశ్

- ఇంగ్లాండ్ బోణి

**బలగం టీవీ, దుబాయ్**

మహిళల టీ20 ప్రపంచకప్‌లో శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో బంగ్లాదేశ్ మహిళల జట్టు పోరాడి ఓడిపోయింది. మాజీ చాంపియన్ ఇంగ్లండ్ తో తలపడిన బంగ్లా.. గట్టి పోటీ ఇచ్చింది. అయితే ఫీల్డింగ్, బౌలింగ్‌లో అద్భుతంగా రాణించిన ఇంగ్లండ్ జట్టు 21 పరుగుల తేడాతో గెలిచి బోణీ కొట్టింది.

మొదట బ్యాటింగ్ ఆడిన ఇంగ్లండ్ 118 పరుగులే చేసింది. బంతి టర్న్ కావడంతో రెచ్చిపోయిన స్పిన్నర్లు నహిదా అక్తర్, ఫహిమా ఖాతూన్‌లు వరుస వికెట్లతో వణుకు పుట్టించారు. అయితే ఓపెనర్ డానియల్ వ్యాట్(43) మాత్రం ఒంటరి పోరాటం చేసింది. ఆఖర్లో వికెట్ కీపర్ అమీ జోన్స్ ధనాధన్ ఆడడంతో ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. తర్వాత బౌలింగ్‌లో ఇంగ్లండ్ అద్భుతం చేసింది.

ఈ స్వల్ప ఛేధనలో బంగ్లా బ్యాటర్ శోభన మొస్ట్రే (44) అద్భుతంగా ఆడింది. మరోవైపు కెప్టెన్ నిగర్ సుల్తానా(15) పరువాలేదనిపించింది. అయితే, ఇంగ్లండ్ స్పిన్నర్లు లిన్సే స్మిత్(2/11), చార్లొట్టె డీన్(2/22)లు వరుస వికెట్లు తీసి బంగ్లాను ఒత్తిడిలో పడేశారు. దాంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 100 లోపే పరిమితమైన బంగ్లా జట్టు 21 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

# ఆస్ట్రేలియా మహిళల బోణి



**బలగం టీవీ, దుబాయ్**

మహిళల టి20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా బోణీ కొట్టింది. శ్రీలంకపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత పేసర్ మేఘన్ షట్(3/12), యువ స్పిన్నర్ సోఫీ మొలినెక్స్(2/20)లు చెలరేగడంతో శ్రీలంకను 93పరుగులకే కట్టడి చేసిన కంగారూ జట్టు.. స్వల్ప లక్ష్యాన్ని 4వికెట్లు కోల్పోయి 14.2ఓవర్లలోనే ఛేదించింది. ఓపెన్ బేత్ మూనీ(43) ధనాధన్ ఆడడంతో ఆసీస్ ఖాతాలో భారీ విజయం చేరింది. ఛేదనలో ఓపెనర్ అలీసా హేలీ(4)ని ప్రభోదిని బౌల్డ్ చేసి లంకకు శుభారంభిచ్చింది. అయితే.. బేత్ మూనీ(43 నాటౌట్) ధనాధన్ ఆడి లంకను ఒత్తిడిలోకి నెట్టింది. కానీ, జార్జియా వరేహం(3) రనౌట్ కాగా అలీసా పెర్రీ(17) సైతం స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగింది. 35 పరుగులకే మూడు వికెట్లు పడినా మూనీ జోరు తగ్గించలేదు. ఆల్‌రౌండర్ అష్ గార్డ్‌నర్(12)లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పింది. యువకెరటం ఫొబే లిచ్‌ఫీల్డ్(9)తో కలిసి జట్టును విజయ తీరాలకు చేర్చింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంకకు ఆస్ట్రేలియా బౌలర్లు కట్టడి చేశారు. ఓపెనర్ విశ్మీ గుణరత్నే(0)ను డకౌట్ చేసి ఒత్తిడి పెంచింది. కెప్టెన్ చమరి ఆటపట్టు(3)ను అష్ గార్డ్‌నర్ ఎల్బీగా పంపింది. దాంతో.. 6 పరుగుల వద్దే ఓపెనర్లు పెవిలియన్ చేరారు. ఆ తర్వాత హర్షిత సమరవిక్రమ(23), కవిష దిల్హారి(5)లు ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. కానీ, సోఫీ మొలినెక్స్(2/20) కవిశను ఎల్బీగా వెనక్కి పంపి లంకను దెబ్బ కొట్టింది. అయితే.. నీలాక్షి డిసిల్వా(29 నాటౌట్) జతగా సమరవిక్రమ స్కోర్‌బోర్డును నడిపించింది. మూడో వికెట్‌కు 31 పరుగులు జోడించిన ఈ జంటను మొలినెక్స్ విడదీసింది. అంతే.. ఆ తర్వాత మేఘన్ షట్ బుల్లెట్ బంతులతో లోయర్ ఆర్డర్‌ను పెవిలియన్ పంపింది. ఆలౌట్ ప్రమాదం తప్పించుకున్న శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేయగలిగింది.

# కలెక్టరేట్‌లో వైభవంగా బతుకమ్మ వేడుకలు



● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బలగం టీవీ,సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో బతుకమ్మ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. వేడుకలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతకు ముందు ఆయా డిపార్ట్మెంట్ ల మహిళా అధికారులు, ఉద్యోగినులు, సిబ్బంది రంగురంగుల పువ్వులతో బతుకమ్మను తీర్చిదిద్దారు. అనంతరం చిత్తు.. చిత్తులా బొమ్మ.. ఒక్కేసి పువ్వేసి చందమామ పాటలకు ఆడి పాడారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మహిళా అధికారులు, ఉద్యోగినులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు.



## డిజిటల్ ఫ్యామిలీ సర్వేలో వివరాలు పక్కాగా సేకరించాలి..

● అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

బలగం టీవీ,సిరిసిల్ల,

డిజిటల్ ఫ్యామిలీ సర్వేలో భాగంగా అన్ని కుటుంబాల వివరాలు పక్కాగా సేకరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు.శనివారం డిజిటల్ ఫ్యామిలీ సర్వే పైలట్ ప్రాజెక్టులో భాగంగా వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలో కొనసాగుతున్న సర్వేను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది చేస్తున్న సర్వే, తీసుకుంటున్న పత్రాలు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ డిజిటల్ ఫ్యామిలీ సర్వేలో భాగంగా ప్రతి కుటుంబానికి సంబంధించిన జనన, మరణ వివరాలు, ఫోటోలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడ వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు

● బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి 'కాకా' కృషి

● అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల,

బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి కృషి చేశారని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు .గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను జిల్లా యువజన అండ్ క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో నిర్వహించగా, అదనపు కలెక్టర్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి "కాకా" చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీ గడ్డంవెంకటస్వామి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం చాల సంతోషకరమని వివరించారు.ఈ కార్యక్రమంలో డీ.వై.ఎస్.ఓ రాందాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ తెలంగాణ సంప్రదాయనికి ప్రతీక




ప్రిన్సిపల్ హరినాథ్ రాజు..

బలగం టీవీ ,రుద్రంగి:

రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పువ్వులతో బతుకమ్మను పేర్చి పసుపుతో గౌరమ్మను చేసి బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హరినాథ్ రాజు మాట్లాడుతూ తెలంగాణ అంటేనే సంస్కృతి సంప్రదాయాలకు పెట్టింది పేరు అని,తెలంగాణ అడపడులందరు ఘనంగా జరుపుకునే బతుకమ్మ పండుగను పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. చిన్నారులు తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చి పాటలు పాడుతూ కొలటలు వేస్తూ బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని అన్నారు. రుద్రంగి మండల ప్రజలకు మరియు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు బతుకమ్మ ,దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తిపిరెడ్డి వెంకటరెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యూ ట్యూబర్ హర్షసాయిపై లుకౌట్ నోటీస్..

బలగం టీవీ, హైదరాబాద్

యూ ట్యూబర్ హర్షసాయిపై సైబరాబాద్ పోలీసులు లుకౌట్ శనివారం లుకౌట్ నోటీసులు జారీ చేశారు. హర్ష సాయి తనపై లైంగిక దాడికి చేయడంతో పాటు నగ్న చిత్రాలతో బెదిరింపులకు పాల్పడుతున్నాడని ముంబయికి చెందిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సెప్టెంబర్ 24న కేసు నమోదు చేసిన విషయం తెలిసింది. కేసు దర్యాప్తులో వేగం పెంచిన పోలీసులు.. ఈ మేరకు నోటీసులు జారీ చేశారు.

పోలీసులు, బాధితురాలి కథనం ప్రకారం.. హర్షసాయి, ముంబయి నటి ఓ పార్టీలో కలిశారు. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇద్దరు ఏకాంతంగా ఉన్న సమయంలో ఫొటోలు తీసుకొని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించింది. నటి కేసు నేపథ్యంలో హర్షసాయి పరారీలో ఉన్నట్లుగా పోలీసులు వర్గాలు తెలిపాయి. అతని కోసం గాలిస్తున్నామని.. ఈ క్రమంలో లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

## సెబీ చీఫ్‌కు సమన్లు

బలగం టీవీ, హైదరాబాద్

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ చేసిన ఆరోపణల నేపథ్యంలో చెలరేగిన వివాదంపై ఈ నెల 24న తన ఎదుట హాజరు కావాలని సెబీ అధిపతి మాధబి పురి బచ్‌ను పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) ఆదేశించింది. ఆర్థిక వ్యవహారాలు, రెవెన్యూ శాఖల అధికారులు కూడా హాజరు కావాలంటూ సమన్లు జారీ చేసింది. పిఎసికి ప్రస్తుతం కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ నేతృత్వం వహిస్తున్నారు. అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఇందులో సభ్యులు. దర్యాప్తు సంస్థ పనితీరుకు సంబంధించిన ఆధారాలను నమోదు చేసే నిమిత్తం తన ఎదుట హాజరు కావాల్సిందిగా వీరికి పీఏసీ సమన్లు జారీ చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై కూడా పీఏసీ సభ్యులు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధిస్తారు. అదానీ గ్రూప్ కంపెనీలకు వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేయడంలో సెబీ నిష్పాక్షిక పనితీరును వీరు ప్రశ్నిస్తారని తెలుస్తోంది. బచ్ దంపతులపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై పార్లమెంటరీ కమిటీ చేత విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే తమపై వచ్చిన ఆరోపణలను బచ్, ఆమె భర్త ఓ సంయుక్త ప్రకటనలో తోసిపుచ్చారు.

## తేజ సజ్జాకు ఉత్తమ నటుడి అవార్డ్

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జాను ఉత్తమ నటుడి అవార్డు వరించింది. 'హనుమాన్' చిత్రంలో నటనకుగానూ హీరో తేజ సజ్జా ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. దాదా సాహెబ్ ఫాల్కే ఎంఎస్‌కే ట్రస్ట్ – 2024 ఈ వార్డును ప్రకటించింది. ఈ మేరకు హనుమాన్ మూవీ మేకర్స్ సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేశారు.కాగా, యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ సినిమాను తెరకెక్కించారు. 2024 సంక్రాంతి బరిలో నిలిచిన ఈ మూవీ భారీ విజయం సొంతం చేసుకుంది. వరల్డ్‌వైడ్‌గా రూ.300 ప్లస్ కోట్లు వసూళ్లు సాధించింది.



# ఇరానీ కప్ విజేత ముంబై

## 27 ఏండ్ల తర్వాత చాంపియన్‌గా నిలిచిన ముంబై




బలగం టీవి, లక్నో

దేశవాళీ క్రికెట్‌లో రికార్డు స్థాయిలో రంజీ ట్రోఫీలు గెలుపొందిన ముంబై తాజాగా ఇరానీ కప్‌ను చేజిక్కించుకుంది. దాంతో 27 ఏండ్ల తర్వాత ముంబై ఎట్టకేలకు ఇరానీ కప్‌లో చాంపియన్‌గా అవతరించింది. టోర్నీలో భాగంగా రెస్టాఫ్ ఇండియా– ముంబయి మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో లీడ్ కారణంగా కప్ ముంబయిను విజేతగా ప్రకటించారు. ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో 537 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 329 పరుగులు చేసింది. రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 416 పరుగులు చేసింది. డబుల్ సెంచరీతో అదరగొట్టిన సర్ఫరాజ్ ఖాన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. కాగా, ఇరానీ కప్‌ను ముంబయి 15వ సారి కైవసం చేసుకోవడం విశేషం.

లక్నో వేదికగా సాగిన ఇరానీ కప్‌లో ముంబై జట్టు సర్ఫరాజ్ ఖాన్(222) డబుల్ సెంచరీతో తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ కొట్టింది. ఆ తర్వాత ప్రత్యర్థిని తక్కువకే ఆలౌట్ చేసింది. అభిమన్యు ఈశ్వరన్(155), ధ్రువ్ జురెల్(93)లు ముంబై బౌలర్లను దీటుగా ఎదుర్కొని జట్టును గట్టెక్కించారు. అయితే.. షామ్స్ ములానీ(3/122), తనుష్ కొతియాన్(3/101)ల విజృంభణతో రెస్టాఫ్ ఇండియా ఇన్నింగ్స్ 416 వద్దే ముగిసింది. దాంతో, అజింక్యా రహానే సేనకు 121 పరుగుల ఆధిక్యం లభించింది. అయితే కీలకమైన రెండో ఇన్నింగ్స్‌లో ముంబై తడబడింది. రెస్టాఫ్ ఇండియా స్పిన్నర్ సరన్ష్ జైన్(6/126) ధాటికి టాప్ ఆటగాళ్లంతా డగౌట్‌కు క్యూ కట్టారు. ఓపెనర్ పృథ్వీ షా(76) అర్ధ సెంచరీతో మెరిసినా మిగతావాళ్లను సరన్ష్ క్రీజులో నిలబడనివ్వలేదు. దాంతో, 171 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఆలౌట్ ప్రమాదంలో పడింది.ఆ పరిస్థితుల్లో తనుష్ కొతియాన్(114 నాటౌట్) అద్భుత పోరాటపటిమ చూపించాడు. మోహిత్ అవస్థి(51 నాటౌట్) అండగా రెస్టాఫ్ ఇండియా బౌలర్లను విసిగిస్తూ సూపర్ సెంచరీ సాధించాడు. అంతేకాదు.. ఆఖరి ఓవర్‌దాకా నిలబడి మ్యాచ్‌ను డ్రాగా ముగించాడు. తనుష్ పోరాటంతో ఐదో రోజు ఆట ముగిసే సరికి ముంబై 8 వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసింది.

# తప్పిదాలపై ఫోకస్ పెట్టాలి

- హర్మన్‌ప్రీత్ కౌర్




బలగం టీవి, లక్నో

న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో తాము చేసిన తప్పిదాలపై ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఉందని టీమిండియా మహిళా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ తెలిపారు. న్యూజిలాండ్‌తో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 58 పరుగు తేడాతో ఓటిమి. ఈ మ్యాచ్ అనంతరం హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ న్యూజిలాండ్ తమ కంటే అత్యుత్తమ క్రికెట్ ఆడటంతోనే టీ20 ప్రపంచకప్ 2024లో శుభారంభం అందుకోలేకపోయామని తెలిపింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయామని చెప్పింది. ఈ టోర్నీలో తాము ఆశించిన ఆరంభం ఇది ఏ మాత్రం కాదని అభిప్రాయపడింది. బౌలింగ్‌లో 10–15 పరుగులు అదనంగా ఇచ్చినట్టు తెలిపింది. ఈ రోజు మేం అత్యుత్తమ క్రికెట్ ఆడలేదు. ఈ మ్యాచ్‌లో మేం చేసిన తప్పిదాలపై ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. టోర్నీలో ముందడుగు వేయాలంటే బలహీనతలను అధిగమించాలని.. ఇక నుంచి తమకు ప్రతీ మ్యాచ్ గెలవడం ముఖ్యమేనన్నారు. న్యూజిలాండ్ మా కంటే మెరుగైన ప్రదర్శన చేసింది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి పెద్ద టోర్నీల్లో చిన్న తప్పు కూడా చేయకూడదు. 160–170 పరుగుల లక్ష్యాలను మేం చాలా సార్లు ఛేదించాం. కానీ ఈ పిచ్‌పై 160 పరుగుల లక్ష్యం అంటే చాలా ఎక్కువ. 10–15 పరుగులు అదనంగా ఇచ్చాం. ఒకానొక దశలో న్యూజిలాండ్ ఆరంభం చూసి.. 180 పరుగులు చేస్తుందేమోననిపించింది. ఈ టోర్నీలో మేం ఆశించిన ఆరంభం ఇది కాదని హర్మన్‌ప్రీత్ కౌర్ చెప్పుకొచ్చింది. న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఘోర పరాజయంతో భారత్ రన్‌రేట్ –2.900 నెగటీవ్‌గా మారింది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ల్లో పాకిస్థాన్, శ్రీలంక, ఆస్ట్రేలియాతో తలపడనుంది. హర్మన్‌సేన సెమీస్ చేరాలంటే ఈ మూడు మ్యాచ్‌లు గెలవడంతో పాటు మెరుగైన రన్‌రేట్ సాధించాలి.

## 'ఔటైన బ్యాటర్‌ను వెనక్కి పిలిపించడం దారుణం'



బలగం టీవి, దుబాయ్




మహిళల టీ20 ప్రపంచకప్ 2024లో టీమిండియాకు తొలి మ్యాచ్‌లోనే న్యూజిలాండ్‌తో 58 పరుగుల తేడాతో ఓడింది. అయితే ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ అమేలియా కేర్ రనౌట్ తీవ్ర వివాదాస్పదమైంది. అంపైర్లపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదాస్పద రనౌట్‌పై భారత మహిళా క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్ స్పందించారు. మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె.. ఔటైన బ్యాటర్‌ను వెనక్కిపిలవడం అత్యంత దారుణమని తెలిపింది. "ఓవర్ ముగిసిందంటూ దీప్తికి అంపైర్ క్యాప్ ఇవ్వడం నేను చూడలేదు. ఆ సమయంలో నేను దూరంగా ఫీల్డింగ్ చేస్తున్నాను. న్యూజిలాండ్ బ్యాటర్లు రెండో పరుగు కోసం ప్రయత్నించారు. అమేలియా కేర్ ఓవర్ పూర్తి కాలేదనే ఉద్దేశంతోనే డబుల్ తీయడానికి ప్రయత్నించింది. మేం కూడా అదే ఆలోచనలో ఉండి రనౌట్ చేశాం. కానీ అంపైర్ మాత్రం విభిన్నమైన నిర్ణయం తీసుకున్నారు. అంపైర్ల నిర్ణయం మా చేతుల్లో లేని వ్యవహారం.ప్లేయర్లుగా వారి నిర్ణయాన్ని గౌరవిస్తాం. కానీ, అమేలియా కేర్ తనకు తానే డగౌట్‌గా వెళ్లే సమయంలో ఆపి మరీ బ్యాటింగ్ చేయించడం మాత్రం దారుణం. ఔటైనట్టు ఆమెకు తెలుసు కాబట్టే పెవిలియన్ బాట పట్టింది.'అని జెమీమా వెల్లడించింది.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ సందర్భంగా అమేలియా కేర్ రనౌట్ అయినా అంపైర్లు నాటౌట్‌గా ప్రకటించారు. దీప్తి శర్మ వేసిన 14 ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ చివరి బంతిని ఎక్స్‌ట్రా కవర్స్ వైపు పంపిన అమేలియా కేర్ ఒక పరుగు తీసింది. ఇదే సమయంలో స్క్వేర్ లెగ్ అంపైర్ ఓవర్ పూర్తయిందనే ఉద్దేశంతో షూస్ లేస్ కట్టుకుంటూ కనిపించింది. అయితే బ్యాటర్లు అమేలియా, సోఫీ రెండో పరుగు కోసం ప్రయత్నించారు. బంతిని అందుకున్న హర్మన్ ప్రీత్ కౌర్ వేగంగా వికెట్ కీపర్ రిచా ఘోష్‌కు అందించగా.. ఆమె రనౌట్ చేసింది. అమేలియా కూడా ఔటన్న ఉద్దేశంతో పెవిలియన్ వైపు కదిలింది. కానీ అంపైర్ బంతి అప్పటికే డెడ్ అయినట్లు ప్రకటించి ఆమెను వెనక్కి పిలిపించింది. తాను ఓవర్ పూర్తయిందని చెప్పానని, ఆ తర్వాత పరుగు తీసినా.. వికెట్ తీసినా లెక్కలోని రాదని వివరించింది. ఈ విషయంపై భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అంపైర్‌తో వాదించినా ఫలితం లేకపోయింది. అయితే మరుసటి ఓవర్‌లోనే అమేలియా ఔటైంది.




## 'మట్కా' టీజర్ విడుదల

బలగం టీవి, హైదరాబాద్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం మట్కా . పలాస 1978 సినిమాతో హిట్ అందుకున్న కరుణ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాకు జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఇప్పటికే ఫస్ట్ లుక్ విడుదల చేయగా.. తాజాగా ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు.

"ఈ దేశంలో చలామణి అయ్యే ప్రతి రూపాయిలో 90 పైసలు నూటికి ఒక్కడే సంపాదిస్తున్నాడు. మిగత 10 పైసల కోసం 99 మంది కొట్టుకుంటారు. నాలాంటోళ్ళు. నువ్వు ఆ 90 పైసలు సంపాదించేవాడివి. 99 మందిలో ఒక్కడిగా మిగిలిపోకు. నీకు ఆ దమ్ము ఉంది" అంటూ డైలాగ్‌తోనే టీజర్ మొదలైంది.

1958–1982 మధ్య కాలంలో దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఒక వాస్తవ సంఘటనను ఆధారం చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది. వైజాగ్ నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో వరుణ్ నాలుగు భిన్న గెటప్పుల్లో కనిపించనున్నారు. ఈ సినిమా ఈ ఏడాది నవంబర్ 14న విడుదల కానుంది.

## 'మా నాన్న సూపర్ హీరో' ట్రైలర్ రిలీజ్

బలగం టీవి, హైదరాబాద్

సుధీర్‌బాబు హీరోగా నటించిన సినిమా 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఆర్న కథానాయిక. సాయాజీ షిండే, సాయిచంద్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అక్టోబర్ 11న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ శనివారం ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ సినిమాను సీఏఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి. సెల్యులాయిడ్స్ పతాకంపై సునీల్ బలుసు నిర్మిస్తున్నారు.


ట్రైలర్ చూస్తుంటే.. డబ్బు కోసం పుట్టగానే తన కొడుకుని(సుధీర్ బాబు) అమ్ముకుంటాడు సాయి చంద్. జన్మ ఇవ్వలేకపోయిన తన కొడుకుగా పెంచుకుంటాడు షాయాజీ షిండే. అయితే తన కొడుకు కోసం 25 ఏండ్ల తర్వాత వచ్చిన తండ్రి దగ్గరికి సుధీర్ బాబు వెళతాడా లేదా పెంచిన తండ్రి దగ్గరనే ఉండి పోతాడా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. తండ్రి కొడుకుల సెంటిమెంట్‌తో ఈ సినిమా రాబోతోంది. తండ్రి– కొడుకు మధ్య ఎమోషనల్ సీన్స్ ట్రైలర్‌లో చూపించారు. 'నాన్న కన్నా డబ్బులు ఎక్కువ కాదు', కళ్లజోడు పెట్టుకుంటే ప్రపంచం మారదు, ప్రేమతో చేసినంత మాత్రాన తప్పు తప్పుకాకుండా పోదు', 'కనగానే తండ్రి అయిపోరు' అనే డైలాగ్స్? ట్రైలర్‌లో హైలెట్స్.



# హైడ్రా ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం..

**బలగం టీవి, హైదరాబాద్**

హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్రవేశారు. ఈ మేరకు రాజ్ భవన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.జీహెచ్ఎంసీ చట్టంలో కొత్తగా 374(బి) సెక్షన్ చేరుస్తున్నట్లుగా ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడేందుకు జీహెచ్ఎంసీ అధికారాలు హైడ్రాకు అప్పగించారు. జలాశయాలు, రోడ్లు, పార్కులు, ఇతర ఆస్తులను కాపాడే బాధ్యత అధికారి లేదా ఏజెన్సీకి అప్పగించే అధికారం ప్రభుత్వానికి కల్పిస్తూ ఆర్డినెన్సు జారీ చేశారు.



# నేడు ఢిల్లీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఆదివారం ఢిల్లీలో తీవ్రవాద నిరోధంపై కేంద్ర హోంశాఖ నిర్వహించనున్న అన్ని రాష్ట్రాల సీఎంలు, హోంమంత్రుల సమావేశానికి రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో సీఎం భేటీ అయ్యే అవకాశం ఉంది.ఇటీవల వరదల నష్టంతో తెలంగాణకు రూ.10వేల కోట్లకు పైగా నష్టం జరిగినట్లు ప్రభుత్వం కేంద్రానికి నివేదిక అందించగా.. పరిహారంగా కేంద్రం రాష్ట్రానికి కేవలం రూ.421కోట్లు మాత్రమే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరింత సాయం చేయాలని సీఎం రేవంత్, కేంద్ర మంత్రులను కోరనున్నట్లు సమాచారం. అలాగే, కాంగ్రెస్ అగ్రనేతలనూ సీఎం రేవంత్ రెడ్డి కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది.





# సచివాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**బలగం టీవి, హైదరాబాద్**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శనివారం సాయంత్రం తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనుసూయ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ బతుకమ్మ ఉత్సవాలలో సచివాలయంలోని ఉన్నతాధికారుల నుండి అన్ని స్థాయిల్లోని మహిళా ఉద్యోగులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు.తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు, వారి పిల్లలు, చిన్నారులు అంతా ఒక చోట చేరి ఆటపాటలతో సంబరాలు చేశారు. దాండియా, బతుకమ్మ ఆటపాటల మధ్య జరిగిన ఈ ఉత్స



# నాగార్జునపై క్రిమినల్ కేసు నమోదు..

**బలగం టీవి, హైదరాబాద్**

సమంత– నాగచైతన్య విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై చర్యలు తీసుకుంటామని సినీ నటుడు నాగార్జున హెచ్చరించిన మరుసటి రోజే ఆయనపై కేసు నమోదు చేశారు. తమ్మిడికుంట కబ్జా చేసి ఎన్ కన్వెన్షన్ కట్టారని మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో నాగార్జునపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. జనంకోసం అనే సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

# ‘బతుకమ్మ అంటే గిట్టదా..పట్టదా’

**బలగం టీవి, హైదరాబాద్**



ముఖ్యమంత్రికి బతుకమ్మ అంటే గిట్టదా, పట్టదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసురాట్లేదా అని నిలదీశారు. రాష్ట్ర పండుగను నిర్వహించుకునేందుకు నిధుల్లేని దౌర్భాగ్యం ఎందుకొచ్చిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వ సంబురంపై ఎందుకింత నిర్లక్ష్యమని, ప్రకృతిని పూజించే విశిష్ట పండుగను స్వచ్ఛమైన పరిసరాల్లో జరుపుకునే భాగ్యం కూడా లేదా మహిళలకు లేదా అన్నారు. బతుకమ్మ చీరెలను రద్దు చేశారు.. ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా చేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారా అని ఎక్స్ వేదిగా నిలదీశారు.

‘బతుకమ్మ అంటే గిట్టదా..పట్టదా ఈ ముఖ్యమంత్రికి?

ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసురాట్లేదా ?

పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా వుంచలేరా ?

చెత్తా చెదారం మధ్య మురికి కంపులో మన అక్కా చెల్లెళ్లు బతుకమ్మ ఆడుకోవాల్నా?

బ్లీచింగ్ పౌడర్ కొనడానికి..చెరువు కట్టమీద లైట్లు పెట్టడానికి పైసల్లేని పరిస్థితులు దాపురించాయి పంచాయతీల్లో!

రాష్ట్ర పండుగను నిర్వహించుకునేందుకు నిధుల్లేని దౌర్భాగ్యం ఎందుకొచ్చింది..?

తెలంగాణ అస్తిత్వ సంబురంపై ఎందుకింత నిర్లక్ష్యం..?

ప్రకృతిని పూజించే విశిష్ట పండుగను.. స్వచ్ఛమైన పరిసరాల్లో జరుపుకునే భాగ్యం కూడా లేదా మహిళలకు?

బతుకమ్మ చీరెలను రద్దు చేసారు..ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా చేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారా..?’ అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# నటుడు రాజేంద్ర ప్రసాద్ కూతురు మృతి

**బలగం టీవి, హైదరాబాద్**

సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద ఇంట్లో విషాదం చోటుచేసుకున్నది. గుండెపోటుతో ఆయన కుమార్తె గాయత్రి మృతిచెందింది. 38 ఏండ్ల గాయత్రికి గత రాత్రి గుండెపోటు వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో చేర్చారు. అయితే పరిస్థితి విషయమించడంతో ఆమె చనిపోయారు. దీంతో రాజేంద్ర ప్రసాద్‌ను పలువురు సినీ ప్రముఖులు పరామర్శించి ధైర్యం చెబుతున్నారు. కాగా, రాజేంద్ర ప్రసాద్‌కు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అలానే గాయత్రి కుమార్తె సాయి తేజస్విని బాలనటిగా మహానటి చిత్రంలో నటించిన విషయం తెలిసిందే.ఓ సందర్భంలో రాజేంద్ర ప్రసాద్ తన కూతురి గురించి మాట్లాడారు. ఆ సమయంలో ఎంతో ఎమోషనల్ అయ్యారు. బేవార్స్ అనే సినిమా ఈవెంట్‌లో తన కుమార్తె గురించి మాట్లాడుతూ, అమ్మ లేని వారు కూతురిలో వారి అమ్మను చూసుకుంటారని రాజేంద్ర ప్రసాద్ అన్నారు. తన పదేళ్ల వయసులోనే తన తల్లి చనిపోయారని, అందుకే తాను కూడా తన కూతురిలో అమ్మను చూసుకున్నానని చెప్పుకొచ్చారు. కూతురు సెంటిమెంట్‌తో వచ్చిన ‘తల్లి తల్లి నా చిట్టి తల్లి’ అనే పాట తనకు ఎంతో ఇష్టమని అన్నారు. ఆ సాంగ్‌ను గాయత్రికి ఎన్నో సార్లు వినిపించినట్లు తెలిపారు.



# ఓజీ కథ ముందే నేను విన్నా : వరుణ్ తేజ్

**బలగం టీవి, హైదరాబాద్**

వరుణ్ తేజ్ కొత్త మూవీ మట్కా టీజర్ రిలీజ్ వేడుక విజయవాడలో జరిగింది. ఈ వేడుకలో వరుణ్ తేజ్, ఓజీ చిత్రం గురించి మాట్లాడారు. ‘బాబాయ్ నటిస్తున్న ఓజీ చిత్రం గురించి ఒక విషయం చెప్పాలి అనుకుంటున్నా. ఈ సినిమా కథ బాబాయ్ కంటే ముందు నేనే విన్నాను. స్టోరీ అదిరిపోయింది. అస్సలు మీ ఊహకు అందదు. మీ వెయిటింగ్‌కు ఇది వర్త్. బాబాయ్ కాస్త బిజీగా ఉన్నారు. కొంచెం అప్పటి వరకు వెయిట్ చేయండి’ అని పేర్కొన్నారు.

